భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

7, అక్టోబర్ 2026, బుధవారం

భారత్ సమాచార్

# స్మృతి మంధానకు బిగ్ రెస్పాన్సిబిలిటీ



భారత్ సమాచార్, స్పోర్ట్స్: భారత మహిళా క్రికెట్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధానకు అన్ని ఫార్మాట్లలో పూర్తి స్థాయి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు బ్యాటర్‌గా తనదైన ముద్ర వేసిన మంధాన.. ఇకపై నాయకురాలిగా భారత మహిళా జట్టును ముందుండి నడిపించనున్నారు.

ఇప్పటివరకు జట్టుకు సారథ్యం వహించిన హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. బ్యాటింగ్‌తో పాటు నాయకత్వంలోనూ జట్టుకు అందించిన సేవలను గుర్తించిన BCCI ఆమెను ప్రత్యేకంగా అభినందించింది. అనంతరం కొత్త పూర్తి స్థాయి కెప్టెన్‌గా స్మృతి మంధాన పేరును అధికారికంగా ప్రకటించింది.

## కెప్టెన్సీలోనూ ఇప్పటికే అనుభవం

మంధానకు కెప్టెన్సీ కొత్త బాధ్యతేమీ కాదు. గతంలో హర్మన్‌ప్రీత్ కౌర్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన ఆమె.. అవసరమైన సందర్భాల్లో జట్టుకు తాత్కాలిక సారథిగా కూడా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు 18 T20లు, 4 వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించిన మంధాన.. జట్టును విజయవంతంగా నడిపించారు.

మహిళల ప్రీమియర్ లీగ్‌లోనూ ఆమె నాయకత్వ సామర్థ్యం స్పష్టంగా కనిపించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మంధాన.. 2024, 2026 సీజన్లలో జట్టును ఛాంపియన్‌గా నిలిపారు. ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం, పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మార్చడం వంటి లక్షణాలతో మంధాన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

## జింబాబ్వే సిరీస్‌తో కొత్త ప్రయాణం

పూర్తి స్థాయి కెప్టెన్‌గా స్మృతి మంధానకు తొలి సవాల్ జింబాబ్వే సిరీస్ రూపంలో ఎదురుకానుంది. అక్టోబర్ 16 నుంచి జింబాబ్వేతో జరగనున్న వైట్-బాల్ సిరీస్‌తో ఆమె కొత్త బాధ్యతలను ప్రారంభించనున్నారు.

స్మృతి మంధాన సారథ్యంలో భారత మహిళా క్రికెట్ జట్టు మరింత దూకుడుగా ముందుకు సాగుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. బ్యాటర్‌గా ఇప్పటికే ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించిన మంధాన.. కెప్టెన్‌గా కూడా టీమిండియాను ప్రపంచ క్రికెట్‌లో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తారని క్రికెట్ అభిమానులు భావిస్తున్నారు.

© 2026 Bharath Samachar